అందని అపెరల్ పార్క్ ఫలాలు

- నెరవేరని అపెరల్ పార్క్ లక్ష్యం
- గత ప్రభుత్వాలు పట్టించుకోని వైనం
- అన్నీ వసతులు ఉన్నా మూత పడుతున్న పరిశ్రమలు
- పార్క్‌పై దృష్టి సారించాలని కోరుతున్న ప్రజలు


గుండ్లపోచంపల్లిలో అపెరల్ పార్క్

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గ పేద ప్రజల ఉపాధి కోసం నాటి ప్రభుత్వం మేడ్చల్ మండలం గుండ్లపోచంపల్లిలో ఏర్పాటు చేసిన 'అపెరల్ పార్క్' లక్ష్యం నెరవేరక అబాసుపాలవుతోంది. నియోజకవర్గంలోని పేద మహిళలకు కుట్టుపని ద్వారా ఉపాధి కల్పించడానికి దివంగత సీఎం నందమూరి తారక రామారావు పరిశ్రమలు ఏర్పాటు చేశారు. 1995 జులై 19న మేడ్చల్ మండలంలోని గుండ్లపోచంపల్లిలో అపరెల్ పార్క్‌కు శంకుస్థాపన జరిగింది. 1999 జూన్ 30న నాటి సీఎం నారా చంద్రబాబు నాయుడు పార్క్‌ను ప్రారంభించారు. ప్రధానంగా అపెరల్ పార్క్‌లో కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నాయి. వస్త్ర పరిశ్రమ ఎక్కువగా కర్ణాటకలో ఉండటంతో అక్కడి వ్యాపారులను అపెరల్ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా పార్క్‌ను రూపొందించారు. గ్రామానికి చెందిన రైతుల నుంచి 157 ఎకరాల భూమిని సేకరించి మొత్తం 226.36 ఎకరాలలో అపరెల్ పార్క్ ఏర్పాటైంది. ఇందులో 129.87 ఎకరాలలో పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా 121 ప్లాట్లను రూపొందించారు. మిగతా 60 ఎకరాలను మరిన్ని పరిశ్రమల కోసం ఖాళీగా వదిలారు. 38 ఎకరాల పార్క్‌లో రోడ్లు, మురికి కాలువలు, ఇతర వసతులతో పాటు కరెంట్ సమస్య తలెత్తకుండా ప్రత్యేకంగా పార్క్ కోసం 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు చేశారు. ఇలా అన్నీ వసతులు ఏర్పాటు చేసినా పార్క్ ద్వారా 30 వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నాటి ప్రారంభోత్సవంలో హామీ ఇచ్చారు.

అన్ని వసతులు ఉన్నా పార్క్‌కు రాని పరిశ్రమలు..

పార్క్‌లో సకల సౌకర్యాలు కల్పించినా పాలకులు పరిశ్రమలను రప్పించడంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలున్నాయి. 121 పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్నా.. పాలకుల ప్రోత్సాహం లేక పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ఉత్సాహం కనబరచడం లేదు. అధికారులు మాత్రం తమ రికార్డుల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ప్లాట్లను కేటాయించినట్లు చెబుతున్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ప్లాట్లు కేటాయించినా పారిశ్రామిక వేత్తల పరిశ్రమల ఏర్పాటు కాగితాలకే పరిమితమైందని పలువురి వాదన.

అడుగులు పడినా..

గత ప్రభుత్వ హయాంలో అడుగులు పడినా ఆతర్వాత వచ్చిన పాలకులు పట్టించుకోకపోవడంతో అపెరల్ పార్క్ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రత్యేకంగా మరింత స్థలం కేటాయించి పరిశ్రమల కోసం శంకుస్థాపనలు చేసినా ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు పట్టించుకోకపోవడంతో అపరెల్ పార్క్ పెద్దగా అభివృద్ధి చెందలేదు. నూతన ప్రభుత్వం అపెరల్ పార్క్‌పై దృష్టిసారిస్తే మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వెంటనే అభివృద్ధి చేయాలని విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి.

మూతపడుతున్న పరిశ్రమలు..

అపెరల్ పార్క్ ఏర్పడినప్పటి నుంచి నెలకొన్న ప్రముఖ బ్రాండ్ల వస్త్ర కంపెనీలు క్రమేపీ మూతపడుతున్నాయి. ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలు అందకపోవడంతో వ్యాపారవేత్తలు కంపెనీలను మూసి వేస్తున్నారు. ఎంతోమంది మహిళలకు ఉపాధి కేంద్రంగా నిలిచిన అపెరల్ పార్క్‌పై పాలకులు దృష్టి సారించాలని మేడ్చల్ ప్రజలు కోరుతున్నారు.


అపెరల్ పార్క్‌లో మూతపడ్డ ప్రముఖ వస్త్ర కంపెనీ

రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులు


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

గౌతంనగర్: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని సిఫిల్ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్, సత్యనారాయణ, కిషోర్, సిఫిల్ కాలనీ సభ్యులు కృష్ణ, ఓంరాజ్, సోమయ్య, శేషగిరిరావు, చంద్రకళ, చంద్రకాంత్, రాజు, సుష్మిత, కిరణ్‌కుమార్, సంధ్య, వనమాల, వీణ, వెంకటేశ్వర్లు, మాధవి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో కార్మికుల పాత్ర కీలకం


పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ వస్తువులను అందజేస్తున్న మేయర్

బోడుప్పల్: నగర పాలకసంస్థను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు పాత్ర కీలకమని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులకు ఆయన చేతి గ్లౌజులు, మాస్కులు, సేఫ్టీ జాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెల్లవారు జామునే లేచి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్త చెదారాన్ని తొలగించడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారని, వారి సేవలు ఎంతో విలువైనవన్నారు. ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తారన్నారు. కమిషనర్ రామలింగం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నారాయణరెడ్డి, కమలాకర్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్ డివిజన్ ఓల్డ్ అల్వాల్‌లోని బెల్లా విస్టా అపార్ట్‌మెంట్ సమీపంలో జరుగుతున్న వరద నీటికాలువ పనులను గురువారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఏఈ అభిషేక్, రామారావు, జలమండలి మేనేజర్ కృష్ణమాచారి, శేఖర్, గిరి, అరుణ్, లింగారెడ్డి, సాజిద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గౌతంనగర్: మల్కాజిగిరి డివిజన్ ఎల్బీనగర్‌లోని మల్లన్న దేవాలయంలో శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయ, రాజగోపుర శిఖరం ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. రాజుగౌడ, శ్రీవాణి, కృష్ణకుమార్, రాజుగౌడ్, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు


ప్రత్యేక పారిశుద్ధ్యంలో కార్పొరేటర్ కల్యాణ్‌కుమార్

బోడుప్పల్: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. గురువారం 12వ డివిజన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్యంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యర్థాలను రోడ్లపై వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్‌కుమార్, గౌతమీనగర్ కాలనీ మాజీ అధ్యక్షుడు దుర్గయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి


క్రీడాకారులతో మాజీ సైనికుడు మామిడాల సంతోష్‌రెడ్డి

మల్లాపూర్: యువత ప్రస్తుతం డ్రగ్స్‌కు బానిస అవుతున్నారని దాని నుంచి బయటపడడానికి క్రీడల వైపు మొగ్గు చూపాలని మాజీ సైనికుడు మామిడాల సంతోష్‌రెడ్డి అన్నారు. నావికాదళ దినోత్సవం సందర్భంగా నాచారంలో సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. విద్యార్థులు మొబైల్‌ఫోన్ గేమ్‌లకు అలవాటుపడకుండా క్రీడాస్థలాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేశారు. రమాకాంత్ లోకే, వీరేంద్ర, శ్యామ్, కృష్ణ, కిషోర్‌రెడ్డి, మధు, విజయ్‌కుమార్‌సింగ్, సంతోష్, సాయిచంద్, శ్రీధర్, సురేందర్, శివ, స్నేహిత్‌రెడ్డి, ప్రశాంత్, ఆలేటి శ్రీకాంత్, రాజు, వివాన్, ఆకాష్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఎత్తుకెళ్తున్న వ్యక్తి రిమాండ్


ద్విచక్ర వాహనాలతో నిందితుడు

మేడిపల్లి: ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల ప్రకారం.. మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీల్లో భాగంగా గురువారం ఉదయం ఓ వ్యక్తి అనుమానాస్పదంగా వస్తున్నాడు. పోలీసులు వాహన పత్రాల గురించి ఆరా తీశారు. సదరు వ్యక్తి పొంతన లేని సమాధానం చెప్పడంతో అనుమానం వచ్చి తమదైన శైలిలో విచారించారు. అతడి పేరు బండారి లతీఫ్(19) రోజువారి కూలీ, నాగార్జునసాగర్ నివాసి అని, వాహనాన్ని మేడిపల్లిలో దొంగతనం చేసినట్లు నిందితుడు నేరం అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. మరో 3 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా అబ్దుల్ అమీర్



మేడిపల్లి: తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా మేడిపల్లికి చెందిన మహమ్మద్ అబ్దుల్ అమీర్ (అజ్జుభాయ్) ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో తాను గెలుపొందానని, పేదలకోసం కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పలు ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా కృషి చేస్తానని, ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, పేద మధ్యతరగతి ప్రజల కోసం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా పనిచేస్తానన్నారు. అధిష్టానం అప్పగించిన ప్రతి బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు.

మేడిపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అజయ్‌కుమార్‌రెడ్డి



మేడిపల్లి: మేడిపల్లి మండల పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పర్వతాపూర్‌కు చెందిన చిలుముల అజయ్‌కుమార్‌రెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలను బుధవారం ప్రకటించింది. చిలుముల మాట్లాడుతూ.. తనను మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న యూత్ కాంగ్రెస్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా..


అరుణ్ పటేల్

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రామంతాపూర్ వెంకట్‌రెడ్డి నగర్‌కు చెందిన అకారపు అరుణ్‌పటేల్ తమ సమీప ప్రత్యర్థులపై 4,453 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ అదిష్టాన వర్గం ఫలితాలు వెల్లడించి అరుణ్‌పటేల్ విజయం సాధించిన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ అన్ని విభాగాల కార్యకర్తలు, నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి మార్గదర్శకంలో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

మల్లాపూర్ అధ్యక్షుడిగా..


జయంత్‌గౌడ్

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మెరుపుల జయంత్‌గౌడ్ 268 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు సాయికిరణ్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, రూపేందర్‌రెడ్డి, వీనేష్‌యాదవ్, సాయి, మధు, టిల్లు, వినోద్, వర్మ, ప్రీత్, అఖిల్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: డివిజన్‌లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అధికారులకు సూచించారు. గురువారం ఆమె ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కుషాయిగూడలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న సీవరేజ్, సీసీరోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని స్థానికులు కోరారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడిన కార్పొరేటర్ త్వరగా పూర్తయ్యేలా చూస్తానన్నారు. అనంతరం వీఎస్‌రెడ్డినగర్ నాలాలో పూడికతీత పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్ డీఈ బాలకృష్ణ, ఏఈ స్వరూప, స్థానిక నేతలు సీతారాంరెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్వర్లు, రాజుగౌడ్, గోపాల్‌యాదవ్, హీరాలాల్‌నాయక్, శిరీష, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ


చిన్నారులతో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి

మల్లాపూర్: అంగన్‌వాడీలో చదువుతున్న 25 మంది విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ అల్వాల్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన యూనిఫామ్‌లను అందజేసినట్లు తెలిపారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పౌష్టికాహారం, పాలు, బాలామృతం వంటి పదార్థాలను అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ పాఠశాలలో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని తెలిపారు. మూడేళ్ల లోపు చిన్నారులను దగ్గరలోని అంగన్‌వాడీలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్‌వాడీ టీచర్ స్వరూప, అయా తారా పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు


జరిమానా విధించిన శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్

కుషాయిగూడ: వ్యాపారులు వారి దుకాణాల ఎదుట చెత్తవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాప్రా శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్ అన్నారు. కాప్రా సర్కిల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసీఐఎల్ చౌరస్తా నుంచి చక్రిపురం వరకు డ్రైవ్ కొనసాగించి పలు దుకాణాల యజమానులకు జరిమానాలు విధించారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్తవేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. జవాన్‌లు, రాజన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్సీ కోదండరాకు వినతిపత్రం ఇస్తున్న ఆటో జేఏసీ యూనియన్ ప్రతినిధులు

మల్లాపూర్: ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్వహించే చర్చల్లో ఆటోడ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య కోరారు. గురువారం ఎమ్మెల్సీ కోదండరాంను ఆటో యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. డిసెంబర్ 7న ఆటోటాక్సీ, వ్యాన్‌క్యాబ్‌లు రాష్ట్రవ్యాప్త బంద్‌కు మద్దతివ్వాలని ఎమ్మెల్సీని కోరారు. జేఏసీ యూనియన్ నేతలు వెంకటేష్, ఏఐటీయూసీ సత్తిరెడ్డి, టీఏడీఎస్ ప్రవీణ్, టీయూసీఐ ఎండీ నజీర్, టీఏడీడబ్ల్యూఏ బాలనర్సింహ, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హైమద్, సికింద్రాబాద్ ఇన్‌చార్జి రాకేష్, రామాంజనేయులు, కృష్ణమూర్తి తదితరులున్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


విద్యుత్ కాంతులతో ఆకట్టుకుంటున్న దేవాలయం

అల్వాల్: నేటి నుండి 15 వరకు అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని ఆలయ వంశపారపర్య చైర్మన్ రాజా సంజయ్‌గోపాల్ సైంచర్, కార్యనిర్వాహణాధికారి మఠం వీరేశం తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఏబీవీపీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


మహా సభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నేతలు

ఉప్పల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఎల్‌బీనగర్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఉప్పల్‌లో మహాసభల పోస్టర్‌ను విద్యార్థి నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 10న నగరంలో నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్తీక్, టౌన్ సెక్రటరీ సంతోష్ తెలిపారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వేడుక ఘనంగా నిర్వహించారు. గురువారం మేడిపల్లిలోని సాయి సురక్ష వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను వృద్ధులకు అందజేశారు. 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి, మహేష్, మధుసూదన్‌రెడ్డి, నేతలు రఘువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా పాలన 'కళాయాత్ర'


మచ్చబొల్లారంలో ప్రచారం చేస్తున్న కళాకారులు

అల్వాల్: ప్రజాపాలన – విజయోత్సవాల్లో భాగంగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృందాలు గురువారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో ప్రజాపాలన కళాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో వారు ప్రచారం నిర్వహించారు. సాంస్కృతిక సారధి కళాకారుల బృందం, స్థానికులు పాల్గొన్నారు.

కబడ్డీలో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

రామంతాపూర్: ఇండియన్ నేవీ డే సందర్భంగా 25 స్కూల్ జట్లు కబడ్డీ పోటీలో పాల్గొనగా.. రామంతాపూర్ సెయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థులు బాలికల విభాగంలో ప్రథమ స్థానం, బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ సూరం రామ్‌రెడ్డి విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసి అనంతరం మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విశ్రాంత నేవీ ఉద్యోగి సంతోష్‌కుమార్, ప్రిన్సిపాల్ సూరం మమతారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు చొక్కయ్య, సాగర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అల్వాల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శంకర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం కొత్తబస్తీలో నివసించే కృష్ణ అనిల్‌కుమార్ (52) డ్రైవర్. కాగా అతడికి ముగ్గురు సంతానం. గత కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్నాడు. మనోవేదనకు గురై ఈనెల 1న తెల్లవారుజామున ఇంట్లో గొంతుకోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.